సాక్షి
శ్రీకాకుళం
శుక్రవారం । 19 । సెప్టెంబర్ । 2025



మా జీవితాలు అంతేనా..?

సమగ్ర శిక్షా విద్యా శాఖలో జీతాలు అందడం లేదు. దీంతో ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారు. - 8లో



సవాలక్ష కండీషన్లు..

ఒక్క సర్టిఫికెట్ కోసం సవాలక్ష కండీషన్లు పెడుతున్నారు. ఆర్టీఏ అధికారులు పట్టించుకోవడం లేదు. - 8లో

రేపు దివ్యాంగుల కోసం స్వాభిమాన్ గ్రీవెన్స్

శ్రీకాకుళం పాతబస్టాండ్: దివ్యాంగుల సమస్యల పరిష్కారం కోసం స్వాభిమాన్ ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమం శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జిల్లా పరిషత్ హాల్‌లో జరగనుంది. ఈ మేరకు జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి శ్రీధర్ రాజా గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. దివ్యాంగులు ఈ అవకాశాన్ని తప్పక వినియోగించుకోవాలని ఆయన సూచించారు.

న్యూస్‌రీల్

నేడు, రేపు రిలే నిరాహార దీక్షలు



ధర్నా చేపడుతున్న విద్యుత్ ఉద్యోగ కార్మికులు

అరసవల్లి: తమ న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలంటూ విద్యుత్ పంపిణీ సంస్థలకు, తద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి అల్టిమేటం జారీ చేసిన విద్యుత్ ఉద్యోగ, కార్మిక సంఘ ఐక్యవేదిక (జేఏసీ) తమ నిరసనలను మరింత ఉధృతం చేసింది. ఈ మేరకు గురువారం భోజన విరామ సమయంలో జేఏసీ నాయకుల ఆధ్వర్యంలో ఉద్యోగ కార్మికులంతా సర్కిల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం జేఏసీ ప్రతినిధులు మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు శుక్ర, శనివారాల్లో సర్కిల్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలను చేపడుతున్నట్లుగా ప్రకటించారు. కార్యక్రమంలో జేఏసీ ప్రతినిధులు మహంతి ప్రభాకరరావు, రమేష్, టీవీ సుబ్రహ్మణ్యం, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ వ్యాధి నియంత్రణలో ముందంజ



వివరాలను అడిగి తెలుసుకుంటున్న ఎయిడ్స్ నియంత్రణ ప్రాజెక్టు డైరెక్టర్ నీలకంఠ రెడ్డి

శ్రీకాకుళం: రాష్ట్రంలో ఎయిడ్స్ వ్యాధి పూర్తిగా నియంత్రణలోనే ఉందని రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ ప్రాజెక్టు సంచాలకులు కె. నీలకంఠ రెడ్డి తెలిపారు. 2010లో 4.1 శాతం ఉన్న వ్యాధి ప్రస్తుతానికి 0.5 శాతానికి తగ్గిందని చెప్పారు. ఇకపై హెచ్ఐవీ రోగులకు ఒకే చోట అన్ని రకాల సేవలు అందించే ఉద్దేశంతో జిల్లా కేంద్రాల్లోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో సంపూర్ణ సురక్ష కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలోని ఏఆర్‌టీ కేంద్రాన్ని సందర్శించి రోగులకు అందుతున్న సేవలను పరిశీలించారు. రాష్ట్రంలో 2.75 లక్షల మంది ఎయిడ్స్ రోగులు ఉన్నారని, వీరందరికీ ఉచిత మందులు, పింఛన్లు అందిస్తున్నామని చెప్పారు, త్వరలో 42 వేల కొత్త పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ మేరీ కేథరిన్, ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ తాడేల శ్రీకాంత్, రిమ్స్ డైరెక్టర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కాశీబుగ్గ డీఎస్పీకి వీఆర్

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాలో కాశీబుగ్గ సబ్‌డివిజనల్ కేంద్రానికి డీఎస్పీగా వ్యవహరిస్తున్న వీవీ అప్పారావును మంగళగిరి డీజీపీ కార్యాలయానికి వీఆర్ అటాచ్ చేస్తూ గురువారం అధికారికంగా ఉత్తర్వులు వెలువడ్డాయి. 2025 ఎన్నికల అనంతరం డీఎస్పీగా పాత్రిని శ్రీనివాసరావు కాశీబుగ్గ రావడం.. అక్కడికి కొద్ది నెలల్లోనే జిల్లా అదనపు ఎస్పీ (క్రైమ్)గా ఉద్యోగోన్నతి పొందడంతో అతని స్థానంలో బదిలీపై వీవీ అప్పారావు వచ్చారు.

30న దళిత సంఘాల జేఏసీ నిరసన



జేసీకి సమస్య వివరిస్తున్న దళిత సంఘాల నేతలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకులాలు నిర్లక్ష్యానికి గురవుతున్నాయని, అధికారులు పర్యవేక్షణ పూర్తిగా కొరవడిందని దళిత సంఘాల నేతలు అన్నారు. పాలకులు, అధికారుల తీరుకు నిరసనగా ఈ నెల 30న జిల్లా కేంద్రంలోని ఆదివారంపేటలో జిల్లా కోఆర్డినేటర్ కార్యాలయం వద్ద దళిత సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు ప్రకటించారు. ఈ ఏడాది ఇంటర్ ఫలితాల్లో అనేక మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించలేదని, బోధన సరిగ్గా లేకపోవడం వల్లే ఈ పరిస్థితి ఎదురైందని, ఇందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు గురువారం జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో దళిత ప్రజా సంఘాల జేఏసీ జిల్లా కన్వీనర్ దుర్గాసి గణేష్, కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిస్కా కృష్ణయ్య, దళిత హక్కుల పరిరక్షణ సమితి జిల్లా నాయకులు బైరి ధనరాజ్, రెల్లి కుల సంక్షేమ సంఘం జిల్లా నాయకులు అర్జీ ఈశ్వరరావు, అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా నాయకులు రాకోటి రాంబాబు పాల్గొన్నారు.

అక్షరమే ఆయుధం



పత్రికా స్వేచ్ఛను హరించడమే



కూటమి తప్పుడు విధానాలు, చేస్తున్న మోసాలను ప్రజల పక్షాన ఉంటూ ప్రజలకు నిర్భయంగా తెలియజేస్తున్న 'సాక్షి'పై అక్రమ కేసులు పెట్టడం శోచనీయం. అలాగే పత్రికా ఎడిటర్‌పై కేసులు పెట్టడం, విచారణకు రావాలని ఆదేశించడం కక్ష పూరితం. ప్రభుత్వ తీరును అంతా నిలదీయాలి. - కరిమి రాజేశ్వరరావు, వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధికార ప్రతినిధి, పార్టీ పార్లమెంటరీ ప్రధాన కార్యదర్శి

కేసులు సరికాదు



ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం చేతకాని కూటమి ప్రభుత్వం సాక్షిపై కేసులు బనాయించడం సరికాదు. ఎల్లో మీడియా లేనివి ఉన్నట్లు...ఉన్నవి లేనట్లు చూపించి ప్రజలను మోసగిస్తోంది. వాటి గురించి చెప్పినా కేసులు పెడతారా..?

- ఎంవీ స్వరూప్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు

ఆరోగ్యశ్రీ సేవలకు బ్రేక్..?



జిల్లా కేంద్రంలో ఓ ఆస్పత్రిలో వైద్యసేవల కోసం వేచి ఉన్న ఆరోగ్యశ్రీ రోగులు

- ఇప్పటికే ఈహెచ్ఎస్ సేవలను అనుమతించని పలు ఆస్పత్రులు
- ఎమర్జెన్సీ సేవలను మినహాయిస్తున్న నెట్‌వర్క్ 'ఆశ' ప్రతినిధులు
- ఆరోగ్యశ్రీ ప్రొసీజర్లను అనుమతించవద్దంటున్న 13 ఆస్పత్రుల యాజమాన్యాలు
- ఇప్పటికే రూ.140 కోట్ల వరకు పెరిగిన ప్రభుత్వ బకాయిలు



అరసవల్లి:

పేదవాడికి ఇన్నాళ్లు కొండంత అండగా నిలబడిన ఆరోగ్య శ్రీ కార్డు ఇప్పుడు చెల్లకుండా పోయే దశకు చేరుతోంది. లక్షలాది ప్రాణాలను కాపాడిన పథకం చిన్నచూపును ఎదుర్కొంటోంది. నిరుపేదల పాలిట సంజీవనిగా కీర్తినొందిన పథకాన్ని మెల్లగా ఎత్తేసేలా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటికే ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీగా పేరు మార్చడంతో పాటు ఈ పథకానికి నెట్‌వర్క్ ఆస్పత్రులుగా ఉన్న యాజమాన్యాలకు రాష్ట్ర వ్యాప్తంగా సుమారుగా రూ.4 వేల కోట్ల వరకు బకాయిలు పెండింగ్‌లో పెట్టింది. దీనిపై ఏపీ స్పెషాలిటీ హాస్పటల్స్ అసోసియేషన్ (ఆశ) రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి అల్టిమేటం జారీ చేశారు. కనీసం రూ.2 వేల కోట్ల వరకు బకాయిలు తీర్చాలని, లేదంటే ఆరోగ్యశ్రీ సేవలను నిలిపివేస్తామని హెచ్చరించినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ సేవలన్నీ నిలిపివేసేలా నిర్ణయించారు. ఈ క్రమంలో ఇప్పటికే రాష్ట్రంలో విజయవాడ, గుంటూరు, నెల్లూరు, ప్రకాశం తదితర పలు ప్రధాన జిల్లాలో ప్రధాన ఆస్పత్రుల్లో ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ సేవలను నిలిపివేశారు. మరికొద్ది రోజుల్లో స్థానిక జిల్లాలోని ఉన్న 13 నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో కూడా ఆరోగ్యశ్రీ సేవలను నిలిపివేసేలా చర్చలు మొదలు పెట్టారు. అలాగే ఎంప్లాయిస్ హెల్త్ స్కీం (ఈహెచ్ఎస్) సేవలను కూడా నిలిపివేసేందుకు సిద్ధపడుతున్నారు. ఈ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆరోగ్యశ్రీ సేవలను కార్పొరేట్/ప్రైవేటు ఆస్పత్రులు నిలిపివేసేలా చర్యలకు దిగడం ఇది రెండోసారి. దీంతో వేలాది మంది రోగులకు ఆందోళన మొదలైంది. ప్రజారోగ్యంపై రాష్ట్ర ప్రభుత్వం చూపిస్తున్న వైఖరిపై మండిపడుతున్నారు.

ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ సేవలు కొనసాగుతున్నాయి..



జిల్లాలో 2024-25 వార్షికంలో మొత్తం 77,578 శస్త్రచికిత్సలను ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ పరిధిలో పూర్తి చేశాం. ప్రస్తుతానికి ఆరోగ్యశ్రీ సేవలు కొనసాగుతున్నాయి. కొన్ని జిల్లాల్లో నిలిపివేశారని వార్తలు వచ్చినప్పటికీ ఈ జిల్లాలో మాత్రం అనుమ తిస్తున్నారు. ఆంక్షలు అమల్లోకి వస్తే.. ప్రభుత్వ ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం చర్యలు చేపడతాం.

- డాక్టర్ ప్రకాశరావు, కోఆర్డినేటర్

బకాయి రూ.140 కోట్లు

జిల్లాలో ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ పథకం కింద 17 ప్రభుత్వ ఆస్పత్రులు, 13 ప్రైవేటు నెట్‌వర్క్ ఆస్పత్రులు నగదు రహిత వైద్య సేవలు అమలు చేస్తున్నారు. అయితే ప్రస్తుతం ఆశా ప్రతినిధుల మార్గదర్శకాల ప్రకారం జిల్లాలో ఆరోగ్యశ్రీ సేవలను, ఈహెచ్ఎస్ సేవలను నిలిపివేసేలా అడుగులు వేస్తున్నారు. రోగుల ఎమర్జెన్సీ సేవలను మాత్రం అనుమతించేలా చర్యలకు దిగనున్నారు. ఇక ఈహెచ్ఎస్ కింద మాత్రం కేసులను అనుమతించకూడదన్నట్లుగా నిర్ణయించారు. వాస్తవానికి జిల్లాలో ఉన్న ప్రైవేటు నెట్‌వర్క్ ఆస్పత్రులకు రూ.140 కోట్ల వరకు బకాయిలు పెండింగ్‌లు ప్రభుత్వమే చెల్లించాల్సి ఉంది. అయితే ఈ బకాయిలను చెల్లించకపోవడంతో ఆస్పత్రుల నిర్వహణ కష్టంగా ఉందన్న కారణంగా సాధారణ ఆరోగ్యశ్రీ కేసులను పూర్తిగా నిలిపివేసేలా చర్యలకు దిగుతున్నారు.

ఇదే ఏడాది జనవరిలో కూడా ఇలాగే ప్రభుత్వం తమ బకాయిలు తీర్చకపోవడంతో అప్పట్లో కొన్ని రోజులు ఆరోగ్యశ్రీ సేవలను, ఈహెచ్ఎస్ సేవలను కూడా నిలిపివేసిన సంగతి విదితమే. మళ్లీ ప్రభుత్వం బకాయిల చెల్లింపులో నిర్లక్ష్యం కారణంగా మళ్లీ అలాంటి పరిస్థితులే పునరావృతం కానున్నాయి. సాధారణ ప్రొసీజర్లను కూడా పట్టించుకోవడంపై పలు కార్పొరేట్ ఆస్పత్రులు విముఖత చూపిస్తున్నారు. దీంతో రోగులపై ఆర్థిక భారం పడే అవకాశాలున్నాయి.

● కుట్రను పసిగట్టారు..

అక్రమార్కుల పనిపట్టారు

- జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న విలువైన స్థలం
- జిరాయితీ స్థలంలో కలిపేసేందుకు కుట్ర
- ధ్వజమెత్తిన గ్రామస్తులు



జాడుపూడి వద్ద జిరాయితీ స్థలంతో కలిపి ప్రభుత్వ గోర్జీ స్థలం చదును చేసిన దృశ్యం



పలాస ఆర్డీఓ కార్యాలయం వద్ద ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన జాడుపూడి గ్రామస్తులు

కంచిలి: జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న ఓ విలువైన స్థలాన్ని కాజేసేందుకు చేసిన ప్రయత్నాలను స్థానికులు ఐకమత్యంతో తిప్పికొట్టారు. రెండు మూడు రోజులుగా ఈ హైడ్రామా నడుస్తోంది. కంచిలి మండలం జాడుపూడిలో జాతీయ రహదారికి ఆనించి 6.2 ఎకరాల జిరాయితీ స్థలం ఉంది. ఆ స్థలం మధ్యలోంచి సుమారు 70 సెంట్లు విస్తీర్ణంలో ప్రభుత్వ పోరంబోకు గోర్జీ సహజసిద్ధంగా ఏర్పడింది. దీన్ని పూర్వం నుంచి గోర్జీగానే పరిగణిస్తున్నారు. ఈ గోర్జీ వెంబడి వ్యవసాయ అవసరాల కోసం ఎడ్ల బండ్లు తిరిగేవి. ప్రస్తుతం ఆ దారి చెట్లు, ముళ్ల పొదలతో నిండిపోయింది. ఈ గోర్జీకి ఆనించి కొత్త చెరువు, చిన్న చెరువు ఉన్నాయి. వీటికి కొండ నుంచి వచ్చే వరద నీరు ఈ గోర్జీ నుంచే ప్రవహిస్తుంటుంది. అలాంటి గోర్జీని కొందరు అక్రమార్కులు కొల్లగొట్టే యత్నం చేశారు. మూడు జేసీబీలు పెట్టి గోర్జీకి రెండు వైపులా ఉన్న జిరాయితీ స్థలాన్ని చదును చేసి కలిపేయాలని ప్లాన్ వేశారు. ఈ స్థలం విలువ రూ.కోట్లలో ఉంటుంది. దీనికి అడ్వాన్సుగా 'పెద్దలకు' రూ.20 లక్షల వరకు ఇచ్చినట్లు సమాచారం. పని పూర్తయ్యాక ఇంకా ఇచ్చేందుకు డీల్ కుదిరినట్లు తెలిసింది. కానీ గ్రామస్తులు అక్రమార్కుల ప్లాన్‌ను తిప్పికొట్టారు. అన్ని రకాల సమాచారాలు సేకరించి మీడియాకు చెప్పడంతో పాటు గురువారం పలాస ఆర్డీఓకు, స్థానిక తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు.

దీంతో రెవెన్యూ యంత్రాంగం రంగప్రవేశం చేసి, గోర్జీ స్థలాన్ని సర్వే చేసి, హద్దులుగా జెండాలను పాతారు. స్థానిక తహసీల్దార్ ఎస్.రమేష్‌కుమార్ వద్ద ఈ విషయాన్ని ప్రస్తావించగా, ఇప్పటికే తన దృష్టికి గోర్జీ స్థలం చదును చేసిన అంశం వచ్చిందని, ఎట్టి పరిస్థితుల్లోనూ గోర్జీ స్థలం ఆక్రమించడానికి ఎవరైనా ప్రయత్నిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

సీటు కోసం ఫీట్లు



బస్సు ఎక్కేందుకు ఎగబడుతున్న విద్యార్థులు

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ప్రతిరోజూ సాయంత్రం విద్యార్థుల కోలాహలం నెలకొంటోంది. నిత్యం సాయంత్రం పూట వివిధ కళాశాలల నుంచి విద్యార్థులు తమ ఊళ్లకు వెళ్లేందుకు చేరుకుంటారు. అలా వస్తున్న విద్యార్థులు కాంప్లెక్స్‌లోకి వచ్చిన బస్సుల్లో సీట్ల కోసం ఎగబడుతున్నారు. బస్సు ఎక్కేందుకు తీవ్రమైన తోపులాట జరుగుతోంది. మరికొంతమంది విద్యార్థులు బస్సు కాంప్లెక్స్ ఇన్‌గేట్‌లోకి వచ్చిన వెంటనే అడ్డంగా పరుగులు తీయడం కనిపిస్తోంది. ఆర్టీసీ అధికారులు వారిస్తున్నా వినడం లేదు. ఎక్కడ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.

ఏఓబీ 'బీ.. కేర్‌ఫుల్'!

- సరిహద్దులో విచ్చలవిడిగా మద్యం విక్రయాలు
- చెక్‌పోస్టులు లేకపోవడంతో అక్రమంగా తరలింపు
- ఒడిశాలో కొనుగోలు చేసి ఆంధ్రాలో అమ్ముతున్న వైనం
- రాత్రిపూట హల్‌చల్ చేస్తున్న మందుబాబులు



బలద గ్రామంలో నిర్వహిస్తున్న బెల్టు షాపులో పట్టుకున్న ఒడిషా మద్యం (ఫైల్)

కొత్తూరు: ఆంధ్రా ఒడిశా బోర్డర్ అక్రమ మద్యం రవాణాకు చిరునామాగా మారింది. సరిహద్దులో చెక్‌పోస్టులు ఎత్తివేయడంతో మత్తు పదార్థాల రవాణాకు అనుకూలంగా మారింది. జిల్లాలో సరిహద్దు గ్రామాల్లోని బెల్టుషాపుల నిర్వాహకులు ఒడిశా నుంచి అక్రమంగా మద్యం తీసుకువస్తూ ఇక్కడ విక్రయిస్తున్నారు. కొత్తూరు మండలంలోని బలద, కడుము, కౌశల్యాపురం, దిమిలి, రాయల, మాతల, నివగాంతో పాటు జిల్లాలోని ఆంధ్రా-ఒడిశా సరిహద్దులో ఉన్న మండలాలకు చెందిన గ్రామాల్లో ఒడిశా మద్యం ఏరులై పారుతోంది. దీంతో రాత్రిళ్లు కూడా మందుబాబులు హల్‌చల్ చేస్తున్నారు. ఎక్సైజ్ అధికారులకు విషయం తెలిసినా ఏమీ అనడం లేదు. స్థానిక పోలీసులకు సమాచారం ఉన్నా చోద్యం చూస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. సరిహద్దు గ్రామాల్లో ఒడిషా మద్యం అమ్మకాలు జరుగుతున్నట్లు జిల్లాలోని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు చేసి పట్టుకుంటున్నారు. అందులో భాగంగా కొత్తూరు మండలంలో ఈ ఆగస్టు 11వ తేదీన బలద గ్రామంలో ఇద్దరు వ్యక్తులు నిర్వహిస్తున్న బెల్టు షాపుల్లో ఒడిషా మద్యం పట్టుకున్నారు. స్థానిక ఎక్సైజ్, పోలీసులు మాత్రం ఎలాంటి దాడులు చేయడం లేదు. బోర్డర్‌లోని ఆంధ్రాకు చెందిన ప్రతి గ్రామంలోని పాన్‌షాపుల్లోనూ మద్యం దొరుకుతోంది. రాత్రి ఏ సమయంలో కావాలన్నా వీరు మద్యం సరఫరా చేస్తున్నారు. దీంతో రాత్రి పూట మందుబాబులు విచ్చలవిడిగా తిరుగుతున్నారు.

తనిఖీలు నిర్వహిస్తున్నాం

ఆంధ్రా-ఒడిశా బోర్డర్‌లోని పల్లెల్లో తనిఖీలు నిర్వహిస్తున్నాం. ఒడిశా మద్యం ఆంధ్రా గ్రామాల్లో నిర్వహిస్తున్న బెల్టు షాపులకు వెళ్తున్నట్లు ఫిర్యాదులు రావడంతో నిత్యం తనిఖీలు నిర్వహిస్తున్నాం. బెల్టుషాపులు నిర్వహించకుండా చర్యలు తీసుకుంటాం.

- కిరణ్మీశ్వరి, సీఐ, ఎక్సైజ్ స్టేషన్, కొత్తూరు

మరణమే చిన్నబోయేలా..

- జెమ్స్‌లో అవయవదానం
- చిరంజీవిగా మారిన సన్యాసినాయుడు



అవయవదానం చేసిన సన్యాసిరావు (ఫైల్)



నివాళులు అర్పిస్తున్న జెమ్స్ సిబ్బంది

శ్రీకాకుళం రూరల్, జి.సిగడాం: జిల్లా కేంద్రంలోని రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో గురువారం మరో అవయవదానం జరిగింది. జి.సిగడాం మండలం, బాతువ గ్రామానికి చెందిన పోతిరెడ్డి సన్యాసిరావు నాలుగు రోజుల కిందట బ్రెయిన్‌స్ట్రోక్‌తో రాజాంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరాడు. అక్కడ మరోసారి స్ట్రోక్ రావడంతో మెరుగైన వైద్యం కోసం జెమ్స్‌కు తరలించారు. చికిత్స అందిస్తున్నా సన్యాసిరావులో కదలికలు లేకపోవడంతో వైద్యులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. బ్రెయిన్ డెడ్ కావడంతో అవయవదానంపై అవగాహన కల్పించారు. మరో ముగ్గురి జీవితాల్లో వెలుగులు నింపడంతో పాటు అతని అవయవాలు సజీవంగా ఉంటాయని వివరించడంతో కుటుంబ సభ్యులు అంగీకరించారు. జీవన్‌దాన్ విధానం ద్వారా లివర్, కిడ్నీలను సేకరించారు. ఇందులో ఒక కిడ్నీని జెమ్స్ ఆస్పత్రికి, మరో కిడ్నీని విశాఖ లోని మెడికవర్‌కు వైద్యులు కేటాయించారు.



ఎన్నాళ్లో ఈ యాతన..?

కొత్తూరు మాతల గ్రామ సచివాలయం వద్ద యూరియా కోసం రైతులు పడుతున్న పాట్లు

కాళ్లు నొప్పులు పుట్టే వరకు నించుంటే గానీ బస్తా యూరియా దొరకడం లేదు. పనులన్నీ మానుకుని లైను కడితే గానీ చీటీలూ అందడం లేదు. ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది ఎరువుల కొరత అన్నదాతను తీవ్రంగా వేధిస్తోంది. దాదాపు ప్రతి ఊరులోనూ ఇవే దృశ్యాలు కనిపిస్తున్నాయి.

● తోపులాట



మాతల సచివాలయం వద్ద..

మండలంలోని మాతల, వసప గ్రామ సచివాలయాల వద్ద గురువారం యూరియా పంపిణీ చేశారు. మాతల గ్రామంలో ఒకేసారి ఎక్కువ మంది రావడంతో తోపులాట జరిగింది. పోలీసులు వచ్చినా గందరగోళం ఆగకపోవడంతో పంపిణీ నిలిపివేశారు. చివరకు తహసీల్దార్ కె.బాలకృష్ణ, ఏఓ స్వర్ణలతలు మాతల చేరుకొని ఇంత వరకు పూర్తిగా యూరియా అందని రైతులను గుర్తించి వారికి అందజేశారు. -కొత్తూరు

● యూరియా కష్టాలు

పాతపట్నం మండలంలోని బూరగాం, ఆర్.ఎల్.పురం గ్రామంలోని రైతు సేవా కేంద్రానికి యూరియా వచ్చిందని రైతులకు తెలియటంతో గురువారం ఒకేసారి రైతు సేవా కేంద్రానికి ఆర్.ఎల్.పురం, రొమదల, రొంపివలస, నల్లబొంతు, ఎ.ఎస్.కవిటి, సీది, తీమర, బూరగాం, సీతారాంపల్లి, బొరుభద్ర గ్రామాలకు చెందిన రైతులు వచ్చి బారులు తీరారు. - పాతపట్నం



పాతపట్నం: ఆర్.ఎల్.పురం రైతు సేవా కేంద్రం వద్ద యూరియా కోసం బారులు తీరిన రైతులు

● ఎదురు చూపులే..



చెన్నాపురంలో యూరియా కోసం వేచి ఉన్న రైతులు

మండలంలో యూరియా కోసం రైతులకు ఎదురు చూపులు తప్పడం లేదు. గురువారం చెన్నాపురం, మాకివలస రైతు సేవా కేంద్రాల పరిధిలో యూరియా పంపిణీ చేశారు. చెన్నాపురానికి 200 బస్తాలు, మాకివలసకు 110 బస్తాలు వచ్చాయి. వచ్చిన యూరియా కంటే డిమాండ్ అధికంగా ఉండటంతో రైతులు పడిగాపులు కాశారు. ఇంత వరకూ యూరియా ఇవ్వని రైతులకు ఇద్దరు ముగ్గురేసి కలిపి ఒక్కో బస్తా చొప్పున పంపిణీ చేశారు. -నరసన్నపేట

● లక్ష్మీపురంలో గొడవ



వ్యవసాయ అధికారితో ఎంపీటీసీ మోహనరావు వాగ్వాదం

పలాస: పలాస మండలం లక్ష్మీపురం రైతు సేవా కేంద్రం వద్ద గురువారం యూరియా కోసం అధికారులతో రైతులు గొడవ పడ్డారు. గతంలో ఈ రైతు సేవా కేంద్రానికి 200 బస్తాల యూరియా వచ్చింది. ఇప్పుడు తాజాగా గురువారం మరో 220 బస్తా యూరియా వచ్చింది. దీంతో సచివాలయం పరిధిలోని లక్ష్మీపురం గ్రామంతో పాటు గరుడఖండి, పాతజగద్దేవుపురం, సరియాపల్లి, గోపాలపురం తదితర గ్రామాల రైతులకు ఈ యూరియా అందరికీ సమానంగా ఇవ్వాల్సి ఉంది. ప్రభుత్వం ఒక ఎకరాకి ఒక బస్తా అని చెప్పినప్పటికీ ఆ విధంగా ఇవ్వకుండా కేవలం లక్ష్మీపురం రైతులకే మొత్తం యూరియా ఇస్తున్నారని, మిగతా గ్రామాలకు యూరియా ఇవ్వడం లేదని రైతులు బూర్లె నరిసింహులు, అంపోలు రాజారావు, బూర్లె మహేష్, ఎంపీటీసీ గొండు మోహనరావు తదితరులు అధికారులను ప్రశ్నించారు. టీడీపీ నాయకులకు మొత్తం యూరియా ఇస్తున్నారని, మిగతా వారికి ఇవ్వడం లేదని ఎంపీటీసీ మోహనరావు పలాస తహసీల్దార్ దృష్టికి తీసుకొని వెళ్లారు. దీంతో తాత్కాలికంగా యూరియా పంపకాన్ని ఆపారు

క్లుప్తంగా

నేడు జిల్లా సాఫ్ట్‌బాల్ జట్ల ఎంపికలు

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ బాలబాలికల సాఫ్ట్‌బాల్ జట్ల ఎంపికలు శుక్రవారం జరగనున్నాయి. శ్రీకాకుళం కోడిరామ్మూర్తి స్టేడియం వేదికగా మధ్యాహ్నం 2 గంటల నుంచి ఎంపికలు మొదలవుతాయని జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే కూన రవికుమార్, ప్రధాన కార్యదర్శి సూర శ్రీనివాసరావు గురువారం తెలిపారు. 2011 జనవరి ఒకటి తర్వాత జన్మించిన బాలబాలికలు అర్హులని చెప్పారు. ఎంపికైన జిల్లా జట్లను అక్టోబర్ 4 నుంచి 6 వరకు విశాఖపట్నం జిల్లా నర్సీపట్నం వేదికగా జరిగే ఏపీ రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్స్ బాలబాలికల సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్–2025 పోటీలకు పంపిస్తామని పేర్కొన్నారు.

వన్‌స్టాప్ సెంటర్ సేవలపై ఆరా



రోగులతో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి హరిబాబు

శ్రీకాకుళం పాతబస్టాండ్/శ్రీకాకుళం: శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలోని మానసిక ఆరోగ్య విభాగం, వన్ స్టాప్ సెంటర్‌ను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు గురువారం సందర్శించారు. రోగులను పరామర్శించి, వారికి అందిస్తున్న వైద్య సేవలు, పౌష్టిక ఆహార సరఫరా, ఆస్పత్రి పరిసరాల పరిశుభ్రతపై ఆరా తీశారు. కార్యక్రమంలో డాక్టర్ డి.విజయలక్ష్మి, టి.అలేఖ్య పాల్గొన్నారు.

లారీ డ్రైవర్‌కు గాయాలు

ఎచ్చెర్ల : కేశవరావుపేట వద్ద జాతీయ రహదారిపై గురువారం వేకువజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో బీహార్ చెందిన లారీ డ్రైవర్ రామ్‌నాథ్‌సాయి తీవ్రంగా గాయపడ్డాడు. ఎచ్చెర్ల ఎస్సై వి.సందీప్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా నుంచి విశాఖపట్నం పోర్టుకు వెళ్తు కంటైనర్ లారీ కేశవరావుపేటకు వద్దకు వచ్చేసరికి ముందు వెళ్తున్న మరో లారీని ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. క్షతగాత్రుడిని 108 ద్వారా రిమ్స్‌కు తరలించారు. ఎచ్చెర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పథకాలపై అవగాహన అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్

శ్రీకాకుళం పాతబస్టాండ్: యువత, మహిళా సంఘాలకు ప్రధాన మంత్రి రైతు నిధి, ఆయుష్మాన్ భారత్, నైపుణ్య భారతం వంటి ప్రధాన పథకాలపై అవగాహన అవసరమని జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు సంచాలకుడు పి.కిరణ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో మేరా యువ భారత్ ఉప సంచాలకుడు కె.వెంకట్ ఉజ్వల్ మాట్లాడుతూ ఆరోగ్య భారత్–ప్రధాన మంత్రి జన ఆరోగ్య యోజన, ప్రధాన మంత్రి రుణ పథకం, డిజిటల్ భారత్ కార్యక్రమాలు, నైపుణ్య భారతం, స్వచ్ఛ భారత్, ప్రతి ఇంటికీ నీరు పథకం, విశ్వకర్మ యోజన, స్టాండ్ అప్ ఇండియా, ఉజ్వల యోజన, బిడ్డను చదివించు–బిడ్డను కాపాడు వంటి పథకాలను వివరించారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ ప్రధాన అధికారి జి.ఎం.శ్రీధర్, నాబార్డ్ సహాయ ప్రధాన అధికారి కె.రమేష్‌కృష్ణ, లీడ్ బ్యాంకు అధికారి పి.శ్రీనివాసరావు, రాష్ట్ర సూక్ష్మ నీటిపారుదల ప్రాజెక్టు సంచాలకుడు ఆర్.శ్రీనివాసరావు, సెట్‌శ్రీ ప్రధాన కార్యనిర్వాహక అధికారి వి.వి.అప్పలనాయుడు, జిల్లా పర్యాటక అధికారి ఎన్.నారాయణరావు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయికుమార్, స్వీప్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు కొమ్ము రమణమూర్తి, స్పందన సంస్థ అధ్యక్షుడు పొన్నాడ కష్టారావు, యువజన సంఘాలు, మహిళా సంఘాల ప్రతినిధులు, మేర యువ భారత్ వాలంటీర్లు పాల్గొన్నారు.

సంస్కృతం సర్టిఫికెట్ కోర్సు ప్రారంభం



మాట్లాడుతున్న వీసీ కె.ఆర్.రజనీ

ఎచ్చెర్ల : పీఎం ఉష నిధులు సహకారంతో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విశ్వ విద్యాలయం తెలుగు విభాగంలో సంస్కృతంలో సర్టిఫికెట్ కోర్సును గురువారం వైస్ చాన్సలర్ కె.ఆర్.రజనీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంస్కృతం నుంచే హిందీ తదితర భాషలన్నీ ఉద్భవించాయని చెప్పారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ బి.అడ్డయ్య మాట్లాడుతూ సంస్కృతం నేర్చుకుని విద్యార్థులు మంచి భవిష్యత్తులో స్థిరపడాలని అన్నారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనూరాధ, ప్రోగ్రామ్ సమన్వయకర్త డాక్టర్ టి.సంతోషి, పావని, తెలుగు భాషా విభాగం సమన్వయకర్త డాక్టర్ పి.లక్ష్మణరావు, ఎస్.లోకేశ్వరి, కె.ఉదయ్‌కిరణ్, బలరాం నాయుడు, ఎం.ప్రకాష్‌రావు, పి.రవికుమార్ పాల్గొన్నారు.

మా జీవితాలు ఇంతేనా?

- సమగ్ర శిక్ష, విద్యాశాఖలో చాలీచాలని వేతనాలు
- ఇబ్బందుల్లో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు
- కనికరించని కూటమి పాలకులు

హిరమండలం:

సమగ్రశిక్ష, విద్యాశాఖలో చిరుద్యోగులైన సీఆర్ఎంటీ (క్లస్టర్ రిజర్వు మొబైల్ టీచర్స్), మండల లెవల్ అకౌంటెంట్లు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు చాలీచాలని వేతనాలతో కుటుంబాలను భారంగా నెట్టుకొస్తున్నారు. రోజురోజుకూ పెరుగుతున్న నిత్యావసర సరుకులు, ఇంటి అద్దెలు, ఖర్చులతో దిక్కుతోచని పరిస్థితిలో అల్లాడిపోతున్నారు. ఏళ్ల తరబడి పనిచేస్తున్నా జీతాలు పెరగడం లేదని, ఉద్యోగ భద్రత లేకుండా ఉండటం లేదని ఆందోళన చెందుతున్నారు. సమాన పనికి సమాన వేతనం కల్పించాలన్న సుప్రీంకోర్టు తీర్పును పాలకులు అమలు చేయకపోవడం తగదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



హిరమండలంలో పాఠాలు భోదిస్తున్న సీఆర్ఎంటీ శ్రీదేవి



హిరమండలం ఎమ్మార్సీ భవనంలో విధులు నిర్వహిస్తున్న సమగ్ర శిక్ష సిబ్బంది

ఇదీ పరిస్థితి..

జిల్లా వ్యాప్తంగా మండల వనరుల కేంద్రాలలో 224 మంది సీఆర్ఎంటీలు, 15 మంది మండల లెవల్ అకౌంటెంట్లు, 30 మంది ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, 30 మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లు, 30 మంది మెసెంజర్లు పనిచేస్తున్నారు. వీరంతా 2012లో ఉద్యోగాల్లో చేరారు. అప్పట్లో వీరికి నెలకు రూ.18500 జీతం అందేది. తర్వాత వచ్చిన పాలకులు జీతాలు విస్మరించగా 2020లో వైఎస్సార్ సీపీ హయాంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు రూ.23,500కు వేతనం పెంచారు.

కక్ష కట్టిన కూటమి..

కూటమి ప్రభుత్వం వచ్చిన ఆరునెలల్లోనే కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు షాక్ ఇచ్చింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో నడుస్తున్న పథకాలలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు, స్థానిక సంస్థలలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు మినిమమ్ టైం స్కేల్ వర్తింప చేయరాదని 2025 జనవరిలో జీవో నంబర్ –2 విడుదల చేసింది. ప్రభుత్వ శాఖలలో మంజూరైన ఖాళీ పోస్టులలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు మాత్రమే అర్హులని తేల్చింది. ఈ జీవో రాజ్యాంగం కల్పించిన సమానత్వ హక్కుకు విరుద్ధమని సిబ్బంది ఆవేదన చెందుతున్నారు. ఇతర రాష్ట్రాలతో పోల్చితే ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సరైన వేతన నిబంధనలు అమలు కావడం లేదని వాపోతున్నారు.

అమలుకాని హామీలు..

కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సంక్షేమ పథకాలు అమలు చేస్తామని కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చినా అమలు చేయడం లేదు. ఇటీవల ఎన్టీఆర్ భరోసా పెన్షన్, నూతన రేషన్ కార్డులు, తల్లికి వందనం వంటి పథకాలు అమలు చేసినప్పటికీ చిరుద్యోగులకు వర్తింపచేయలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యావసర ధరలు, రవాణా ఖర్చులు, వైద్యఖర్చులు, ఇంటి అద్దె విపరీతంగా పెరగడంతో జీతాలు సరిపోవడం లేదని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వాపోతున్నారు. నెలవారీ ఖర్చుల కోసం అప్పులు చేయాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జీతం పెంపుతో పాటు రిటైర్‌మెంట్ వయసు పెంపు, ఆరోగ్య భద్రత, పిల్లల విద్య, ఇంటి అద్దె భృతి, రేషన్ సబ్సిడీ పథకాలు, పదవీ విరమణ ప్రయోజనాలు వంటివి ప్రత్యేకంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

వేతనాలు పెంచాలి



జీతాలు పెరగక ఇబ్బందులు పడుతున్నాం. నిత్యావసర ధరలు, రవాణా, వైద్యం, ఇంటి అద్దె వంటి ఖర్చులు విపరీతంగా పెరగడంతో కుటుంబ పోషణ భారమవుతోంది. నెలవారీ ఖర్చుల కోసం అప్పులు చేయాల్సి వస్తోంది. ప్రభుత్వం స్పందించి జీతాలు పెంచాలి.

– కె.చంద్రరావు, సీఆర్ఎంటీ, అవలంగి క్లస్టర్, హిరమండలం

ఉద్యోగ భద్రత కల్పించాలి



కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలి. చాలీచాలనీ జీతాలతో ఇబ్బందులు పడుతున్నాం. ఉపాధ్యాయుల మాదిరిగానే సెలవులు వర్తింపచేయాలి. ఉద్యోగ విరమణ 62 ఏళ్లకు పెంచి రిటైర్మెంట్ ప్రయోజనాలు కల్పించాలి.

– పోలాకి తవిటినాయుడు, సీఆర్ఎంటీ జిల్లా అధ్యక్షుడు

పరిశోధనలతోనే ఉజ్వల భవిష్యత్

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రస్తుత పోటీ ప్రపంచంలో పరిశోధనలవైపు విద్యార్థులు దృష్టి సారిస్తే అద్భుతంగా రాణించగలుగుతారని మేరా యువ భారత్ డిప్యూటీ డైరెక్టర్ కె.వెంకట్ ఉజ్వల్ పేర్కొన్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కణితి శ్రీరాములు అధ్యక్షతన కళాశాల సిల్వర్ జూబ్లీ ఆడిటోరియం వేదికగా సమాజంలో సైన్స్ వైబ్రేషన్స్ పేరిట జరిగిన రెండు రోజుల సైన్స్ ప్రయోగాల ప్రదర్శన గురువారంతో ముగిసింది. కళాశాల సెంటర్ ఫర్ అప్లయిడ్ సైన్సెస్, జంతుశాస్త్ర విభాగాలు సంయుక్తంగా.. ఇండిజీనియస్ సొసైటీ ఫర్ ప్రోగల్ సైన్స్ ఇన్వెన్షన్ సొసైటీ సౌజన్యంతో ఈ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు శ్రీకాకుళం మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కింతలి సూర్యచంద్రరావు, జన విజ్ఞాన వేదిక జిల్లా కన్వీనర్ గొంటి గిరిధర్, వివిధ కళాశాలల అధ్యాపకులు ఎగ్జిబిషన్‌ను సందర్శించారు. ఇలాంటి ఎగ్జిబిషన్‌తో శాస్త్రీయ దక్పథం పెంపొందించవచ్చన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతిఒక్కరికి నిర్వహనకర్త డాక్టర్ మదమంచి ప్రదీప్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వై.పోలినాయుడు, ప్రొగ్రాం కోఆర్డినేటర్స్ డాక్టర్ రోణంకి హరిత, పి.సుధారాణి, శివాల రవిబాబు, కె.అపర్ణ, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మేరా యువ భారత్ డీడీ కె.వెంకట్ ఉజ్వల్

గ్రానైట్ క్వారీతో ప్రశాంతత దూరం చేయొద్దు

మెళియాపుట్టి: గ్రానైట్ క్వారీ వల్ల గ్రామం మట్టి దిబ్బలా మారిపోతుందని, ఇప్పటికే చుట్టుపక్కల గ్రామాల ప్రజల ఇబ్బందులు చూస్తున్నామని, తమ గ్రామ పరిధిలో గ్రానైట్ క్వారీ ఏర్పాటు చేసి ప్రశాంతత లేకుండా చేయవద్దని మెళియాపుట్టి మండలం సుర్జిని గ్రామస్తులు తేల్చిచెప్పారు. ఈ మేరకు దుర్గమ్మ కొండ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్వారీలో తవ్వకాలు, రాళ్ల రవాణా వల్ల గ్రామం దుమ్ముధూళితో నిండిపోవడమే కాకుండా రాళ్లు ఇళ్లపై పడి ప్రమాదాలు జరగే అవకాశం ఉందన్నారు. ప్రశాంతంగా జీవిస్తున్న తాము నిద్రలేని రాత్రుళ్లు గడపాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం తహశీల్దార్ పాపారావుకు కార్యాలయంలో వినతిపత్రం అందించారు. తమకు సమాచారం ఇవ్వకుండా ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారని చెప్పారు. శక్తి మూగాంబికా క్వారీ యాజమాన్యం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ బయటి గ్రామాల ప్రజలను తీసుకొచ్చి అభిప్రాయ సేకరణ ముగించారని పేర్కొన్నారు. ప్రథమపౌరుడు గ్రామ సర్పంచ్ పెద్దింటి చంద్రరావుకు కూడా సమాచారం ఇవ్వలేదన్నారు. నిరసన కార్యక్రమంలో కొర్ల కృష్ణమూర్తి, ఇప్పిలి రామారావు, ఢిల్లేశ్వరరావు, జన్ని రామారావు, కొర్ల వేణు, కొర్ల లోకేశ్వరరావు, పైల కూర్మనాయకులు, కింతలి కిరణ్, రాంబాబు, గ్రామ మహిళలు పాల్గొన్నారు.



తహశీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

పొదుపు సొమ్ము స్వాహా

- జనసేన వార్డు ఇన్‌చార్జి భార్య నిర్వాకం



పోలీస్‌స్టేషన్ వద్ద గ్రూప్ సభ్యులు

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం మున్సిపాలిటీలోని 17వ వార్డు సంతపేటకు చెందిన జనసేన పార్టీ వార్డు ఇన్‌చార్జి కర్రి నాగరాజు భార్య కృష్ణవేణి శ్రీభువనేశ్వరి ఎస్‌హెచ్‌జీ గ్రూప్ లీడర్‌గా వ్యవహరిస్తోంది. ఈమె గ్రూప్ సభ్యులతో కలిసి గత ఏడాది జనవరి 11న రూ.15 లక్షలు రుణంతీసుకున్నారు. సభ్యులు వాయిదాలు చెల్లించేందుకు ఇస్తున్న సొమ్మును బ్యాంకులో జమ చేయకుండా గ్రూప్ లీడర్ కృష్ణవేణి తన సొంత అవసరాలకు వాడుకుంది. దీనితో పాటు పొదుపు సొమ్ము రూ.2,74,500 కూడా సభ్యులెవరికి తెలీయకుండా డ్రా చేసింది. తొమ్మిది నెలల తర్వాత విషయం వెలుగు చూడటంతో ఆమె భర్త నాగరాజును సభ్యులు నిలదీశారు. మొత్తం సొమ్మును ఆగస్టు 25 నాటికి చెల్లిస్తామని పోలీసుల సమక్షంలో అంగీకరించారు. ఇప్పటి వరకు ఒక్క పైసా కూడా చెల్లించలేదు. ఇదేంటని ప్రశ్నిస్తే దిక్కున్న చోట చెప్పుకోవాలని దురుసుగా ప్రవర్తించాడని సభ్యులు వాపోతున్నారు. ఈ మేరకు గురువారం పట్టణ ఎస్సై ముకుందరావు వద్ద మొరపెట్టుకున్నారు. నాగరాజుపై చర్యలు తీసుకొని బ్యాంకుకు బకాయిలు చెల్లించేలా చూడాలని కన్నీటి పర్యంతమయ్యారు.

ఒక్క సర్టిఫికెట్.. సవాలక్ష కండీషన్లు!

- ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు కోసం ఆటోడ్రైవర్ల పాట్లు
- సిబ్బంది అదనపు వసూలు చేస్తున్నారని ఆవేదన
- పట్టించుకోని ఆర్టీఏ అధికారులు



ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కోసం క్యూకట్టిన ఆటోలు

శ్రీకాకుళం రూరల్ : జిల్లా కేంద్రంలోని కిమ్స్ ఆస్పత్రి నుంచి వ్యవసాయశాఖ కార్యాలయానికి వెళ్లే దారిలో ఏర్పాటు చేసిన గవర్నమెంట్ అప్రూవ్ ఫిట్‌నెస్ కేంద్రం (వైదంతి సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్) నిర్వాహకులు ఆటోడ్రైవర్లను ముప్పుతిప్పలు పెడుతున్నారు. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఇచ్చేందుకు సవాలక్ష కండీషన్లు పెడుతున్నారు. వాహనాలు బట్టి వేల రూపాయల్లో వసూళ్లు చేస్తున్నారని పలువురు డ్రైవర్లు ఆరోపిస్తున్నారు. వాహన మిత్ర పథకానికి కీలకంగా మారిన ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల జారీలో తీవ్ర జాప్యంతో బుధవారం రాత్రి వందలాది ఆటోడ్రైవర్లు నరకయాతన పడిన సంగతి తెలిసిందే. గురువారం కూడా ఇదే పరిస్థితి కొనసాగింది. వందలకొద్దీ ఆటోలు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కోసం క్యూకట్టాయి. ప్రభుత్వ నిబంధనల మేరకు డ్రైవర్లు చలానాలు తీసుకొని ఫిట్‌నెస్ కేంద్రానికి వెళ్లారు. అయితే అక్కడి సిబ్బంది సవాలక్ష కండీషన్లు పెట్టి వెనక్కి పంపేశారు. గతంలో ఆర్టీఏ అధికారులు తమకు ఇలాగే ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌లు మంజూరు చేశారని చెప్పినా వినిపించుకోవడం లేదని పలువురు ఆటో డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేశారు.



స్టిక్కర్, నంబర్‌ప్లేట్‌కు అదనంగా డబ్బులు వసూలు చేశారని చెబుతున్న బాధితుడు

పర్యవేక్షణ కరువు..



ఫిట్‌నెస్ కేంద్రం ప్రైవేట్‌పరం కావడంతో ఇష్టమొచ్చినట్లుగా దోపిడీ చేస్తున్నారు. ఇక్కడ ఆర్టీఏ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో వారు అడిగినంత సొమ్ము ముట్టచెప్పుకోవాల్సి వస్తోంది. అప్పులు చేసుకొని కమీషన్లు ఇవ్వాల్సి వస్తోంది.

– చిన్నారావు, ఆటో డ్రైవర్, గార

వ్యయప్రయాసలు..



అప్పట్లో ప్రతి ఆర్టీఏ కేంద్రం పరిధిలోనూ ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కేంద్రాలు ఉండేవి. ఇప్పుడు జిల్లా మొత్తానికి ఒకే కేంద్రం ఏర్పాటు చేయడంతో ఇక్కడికి రావాలంటే వ్యయ ప్రయాసలకు గురికావాల్సి వస్తోంది.

– ఎం.చలపతిరావు, ఆటో డ్రైవర్, సారవకోట

ఇదేం తీరు..



ఆటో తీసుకుని ఫిట్‌నెస్ సెంటర్‌కు వెళ్లాను. అక్కడి సిబ్బంది గతంలో ఉన్న రేడియం స్టిక్కర్లు తీసేసి వారు ఇచ్చే కలర్ స్టిక్కర్లు, కొత్త నంబర్ ప్లేట్ వేసుకోమన్నారు. దీనికి అదనంగా రూ.500 బలవంతంగా వసూలు చేశారు.

– కూర్మారావు, ఆటో డ్రైవర్, ఆమదాలవలస

రాష్ట్రంలో రాజ్యాంగ విరుద్ధ పాలన

- పేరుకే కూటమి ప్రభుత్వం..నడిపించేదంతా టీడీపీయే
- 'సాక్షి'తో మాజీమంత్రి ధర్మాన ప్రసాదరావు



శ్రీకాకుళం రూరల్:

రాష్ట్రంలో రాజ్యాంగబద్ధంగా పాలన సాగడం లేదని మాజీమంత్రి, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు ధర్మాన ప్రసాదరావు అన్నారు. గురువారం ఆయన 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. పాలన, సంపద అందరికీ అందాలనే ఉద్దేశంతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ఐదేళ్లు పరిపాలించారని చెప్పారు. ప్రస్తుత సీఎం చంద్రబాబు రూ.లక్ష కోట్లు ఒకే రాజధానికి పెడితే మిగిలిన ప్రజలు ఏం కావాలని, మళ్లీ వచ్చిన ప్రభుత్వాలు ఆ లక్ష కోట్లు అప్పు తీర్చే పనిలో ఉండాలా? అని ప్రశ్నించారు. ఇది రాజ్యాంగ విరుద్ధమన్నారు. నాయకుడికి ప్రత్యేక బాధ్యత ఉంటుందని, అందరూ నాయకులుగా ఎదగాలని పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పార్టీలో కష్టపడే ప్రతిఒక్కరికీ ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. కష్టపడే తత్వం, చిత్తశుద్ధితో పనిచేస్తే అవకాశాలు తప్పక వస్తాయన్నారు. అందరి సహకారంతో వైఎస్సార్‌సీపీ తిరుగులేని శక్తిగా మారుతోందన్నారు. పార్టీలో ఇటీవల వివిధ పదవులు స్వీకరించిన వారంతా క్రమశిక్షణతో మెలగాలన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడే సంపూర్ణ నాయకుడిగా ఎదిగే అవకాశం ఉంటుందన్నారు.

బీజేపీ, జనసేనల పాత్ర శూన్యం..

రాష్ట్రంలో తెలుగుదేశం, బీజేపీ, జనసేన పార్టీలు కూటమిగా ఏర్పడి అధికారంలోకి వచ్చాయని, ప్రస్తుతం టీడీపీ మాత్రమే అధికారాన్ని చలాయిస్తోందని ధర్మాన విమర్శించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం లేదని, తెలుగుదేశం ప్రభుత్వం మాత్రమే నడుస్తోందన్నారు. బీజేపీ, జనసేన పాత్ర ఏమీ లేదన్నారు. కేవలం టీడీపీ నేతలు మాత్రమే కూటమి ప్రభుత్వం అంటూ ఢంకా మోగిస్తున్నారని, చేసిన పాపాలు ఇతర పార్టీలపై నెట్టేయాలనే ధోరణితోనే తెలుగుదేశం అలా వ్యవహరిస్తోందని చెప్పారు.

ఆందోళన వద్దు..

రెడ్‌బుక్ పేరుతో వైఎస్సార్ సీపీ నేతలను వేధించడమే పనిగా పాలకులు వ్యవహరిస్తున్నారని ధర్మాన ధ్వజమెత్తారు. వేధింపులపై ఎవరూ ఆందోళన చెందవద్దని, మనకు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అండగా ఉన్నారని భరోసా ఇచ్చారు. సమాజంలో అట్టడుగు వర్గాలు, రైతులు, కార్మికుల ప్రయోజనాలు కోసం వైఎస్సార్ సీపీ పనిచేస్తోందని స్పష్టం చేశారు.

నిర్భయంగా చెప్పండి..

అమరావతి రాజధాని ప్రాంతం చిన్న వర్షానికే చెరువులను తలపిస్తోందని ధర్మాన విమర్శించారు. చిన్నపాటి రాజధాని చెరువు అయితే అది కనిపించకూడదని చంద్రబాబు ప్రభుత్వం తన అనుకూల మీడియాతో మేనేజ్ చేస్తోందని ఆయన మండిపడ్డారు. ఇలాంటివి బయట ప్రపంచానికి తెలియాలంటే సోషల్ మీడియా ద్వారానే సాధ్యపడుతుందన్నారు. ఈ ప్రభుత్వం పెట్టే అక్రమ కేసులకు భయపడాల్సిన అవసరం లేదని, నిజాన్ని నిర్భయంగా వెలికి తీయాలని ధర్మాన పిలుపునిచ్చారు.

పోలీసుస్టేషన్ ఎదుట వివాహిత ఆత్మహత్యాయత్నం

పలాస: కాశీబుగ్గ పోలీసుస్టేషన్ ఎదుటే ఓ వివాహిత గురువారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పోలీసులు, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. పలాస మండలం గొల్లమాకన్నపల్లి గ్రామానికి చెందిన రాపాక రూపావతికి మందస మండలం లింబు గ్రామానికి చెందిన భానుతేజతో రెండున్నరేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి కుమారుడు ఉన్నాడు. కొంతకాలంగా దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. నెల రోజుల కిందట కాశీబుగ్గ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదుచేసుకున్నారు. పోలీసులు ఇద్దరిని పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చి పంపించారు. గురువారం రూపావతి కాశీబుగ్గ పోలీసు స్టేషన్‌కు చేరుకొని తన భర్తతో పాటు అత్తమామలు ఏకమై వేధించి దాడి చేశారని మరోసారి ఫిర్యాదు చేసింది. దీంతో సీఐ సూర్యనారాయణ భానుతేజకు ఫోన్ చేసి కేసు నమోదు చేస్తానని హెచ్చరించారు. అయినప్పటికీ భానుతేజ వినకుండా తాను ఎట్టి పరిస్థితుల్లోనూ రూపావతిని అంగీకరించేది లేదని చెప్పడంతో మనస్థాపానికి గురైంది. కుమారుడిని స్టేషన్ వద్దే ఉంచి బిస్కెట్ కొనిస్తానని చెప్పి బజారుకు వెళ్లి పురుగుల మందు తాగింది. పోలీసు స్టేషన్ చేరుకుని స్పృహతప్పి పడిపోయింది. పోలీసులు వెంటనే స్పందించి పలాస ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో కుటుంబీకులు ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు.



చికిత్స పొందుతున్న రూపావతి

వివాహిత ఆత్మహత్య

నందిగాం: దీనబంధుపురం పంచాయతీ తమలాపురం గ్రామానికి చెందిన వివాహిత ఆత్మహత్య చేసుకుంది. నందిగాం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా దేవుపురం గ్రామానికి చెందిన శిల్పా చౌదరితో తమలాపురం గ్రామానికి చెందిన రాజేష్ చౌదరి 2019లో వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. కొంతకాలంగా భార్యను రాజేష్ వేధిస్తున్నాడు. ఆ బాధ భరించలేక గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి పాండవ లక్ష్మీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నందిగాం ఎస్సై షేక్ మహమ్మద్ అలీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎంపీ లాడ్స్ నిధులతో అభివృద్ధి

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఎంపీ లాడ్స్ నిధులు సద్వినియోగం చేసుకుంటూ జిల్లా అభివృద్ధికి కృషి చేయాలని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. కలెక్టరేట్ సమావేశం మందిరంలో గురువారం ఎంపీ లాడ్స్, జాతీయ రహదారుల, జల జీవన్ మిషన్ పథకాలపై సమీక్ష నిర్వహించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి క్షేత స్థాయి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏ సంవత్సరం ప్రారంభించిన కార్యక్రమం.. అదే సంవత్సరం ముగించాలి అనే విధానంలో ఎంపీ లాడ్స్ నిధులను ఖర్చు చేస్తున్నామని చెప్పారు. కోస్టల్ కారిడార్ ద్వారా తీరానికి ఆనుకొని ఆరు లైన్ల జాతీయ రహదారి రానుందని చెప్పారు. భోగాపురం ఎయిర్‌పోర్టును రానున్న జూన్ నాటికి పూర్తి చేస్తామని తెలిపారు. జిల్లా పరిధిలో 180 కిలోమీటర్లకు పైగా ఉన్న జాతీయ రహదారిలో అనేక బ్లాక్ స్పాట్‌లను గుర్తించామని, వాటి వద్ద ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రాష్ట్రంలో జల జీవన్ పరిస్థితి అంతంతమాత్రంగానే ఉంటే.. శ్రీకాకుళం పరిస్థితి మరింత దారుణంగా ఉందని మంత్రి తెలిపారు. ఉద్దానం ప్రాజెక్టును బలోపేతం చేస్తున్నామన్నారు. సమావేశంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన ట్రాక్టర్

అరసవల్లి: శ్రీకాకుళం పాతబస్టాండ్‌లోని పెద్ద మార్కెట్ వద్ద బుధవారం అర్ధరాత్రి విద్యుత్ స్తంభాన్ని ఓ ట్రాక్టర్ ఢీకొట్టింది. ఒక్కసారిగా స్తంభం ఒరిగిపోయి వైర్లు తెగి పడ్డాయి. జనసంచారం లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనతో పాతబస్టాండ్ పరిసర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న విద్యుత్ శాఖాధికారులు అప్రమత్తమై యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేయించి వేకువజామున విద్యుత్ సరఫరా అందించారు. తాగిన మత్తులో ట్రాక్టర్‌ను నడిపి విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొట్టారని స్థానికులు చెబుతున్నారు. అయినప్పటికీ ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్ యజమానిపై సంబంధిత విద్యుత్‌శాఖ, మున్సిపల్ కార్పొరేషన్, ట్రాఫిక్ పోలీసులు గానీ ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం గమనార్హం. స్థానిక రాజకీయ నేతల జోక్యంతోనే ప్రమాద ఘటనకు కారకులను విడిచిపెట్టినట్లు ప్రచారం జరుగుతోంది.



ట్రాక్టర్ ఢీకొనడంతో విరిగిన స్తంభం